నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత

పది రోజులకో ప్రాణం పోవాల్నా?

- నిర్వీర్యమైన పాఠశాల విద్యావ్యవస్థ
- కలుషితాహారంతో విద్యార్థుల అవస్థ
- పట్టనట్టు వ్యవహరిస్తున్న ప్రభుత్వం
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్
- వాంకిడి విద్యార్థిని శైలజకు పరామర్శ

ఖైరతాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో పది రోజులకో పసిబిడ్డ ప్రాణం పోవాల్నా? అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ గురుకులాలు, పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థుల ప్రాణాలు పోతున్నా రేవంత్‌రెడ్డి సర్కారు పట్టనట్టు వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు ఏ పాఠశాలను చూసినా ఏదో ఒక దుర్ఘటన జరిగిన దాఖలాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యావ్యవస్థ ధ్వంసమైందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ ఒక్క విద్యార్థి కూడా అస్వస్థతకు గురికాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మరణించిన 42 మంది పిల్లల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషితాహారం తిని అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజను, ఆమె కుటుంబసభ్యులను శనివారం ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు దవాఖానల పాలవుతున్న వరుస ఘటనలు బాధకరమని ఆవేదన వ్యక్తంచేశారు. శైలజ పరిస్థితి విషమంగా ఉన్నదని, వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నదని తెలిపారు.

నెలకు ముగ్గురు విద్యార్థుల మృతి

రాష్ట్రంలో సగటున నెలకు ముగ్గురు విద్యార్థులు మృత్యువాత పడుతున్నారని ఎమ్మెల్సీ కవిత ఆవేదన వ్యక్తంచేశారు. "రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతున్నది. సగటున నెలకు ముగ్గురు చొప్పున ఇప్పటివరకు 42 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రేవంత్ సర్కారు నిర్లక్ష్యం కారణంగా ఆహారం కలుషితమై మరణించారు. సగటున పది రోజులకు ఒకపసి ప్రాణాన్ని ప్రభుత్వం పొట్టన పెట్టుకుంటున్నది. అన్ని సంక్షేమ శాఖలు సీఎం వద్ద ఉండటం వల్ల పర్యవేక్షణకు, సమీక్షకు సమయం వెచ్చించలేకపోతున్నట్టు కనిపిస్తున్నది. కనీసం పది నిమిషాల సమయం కేటాయించి సమీక్షిస్తే పసి ప్రాణాలను కాపాడే పరిస్థితి ఉంటుంది" అని సూచించారు. నారాయణపేట హాస్టల్‌లో కలుషిత ఆహారం తినడం వల్ల పిల్లలు అనారోగ్యం పాలైన తర్వాత మరునాడే మరో ఘటన జరగడం దారుణమని ఆందోళన వ్యక్తంచేశారు. గతంలో కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఐఐటీ, ఐఐఎంకు వెళ్లాలా? ఎవరెస్టు శిఖరం అధిరోహించాలా? అనే ఉన్నత ఆశయాలు, లక్ష్యాలు కలిగి ఉండేవారని ఆమె గుర్తుచేశారు. కవిత వెంట బీఆర్‌ఎస్ నేతలు రూప్‌సింగ్, శివశంకర్, రాజీవ్‌సాగర్, నవీనాచారి, ముఠా జయశంకర్, మారిపెల్లి మాధవి ఉన్నారు.

విషమంగానే శైలజ ఆరోగ్య పరిస్థితి

- నిమ్స్‌లో పరామర్శించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ)/ఖైరతాబాద్ : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషితాహారం తిని అస్వస్థతకు గురై నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్‌తో కలిసి శనివారం నిమ్స్‌లో విద్యార్థినిని పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వాంకిడి ఆశ్రమ పాఠశాలలో కలుషితాహారం తిని అస్వస్థతకు గురైన జ్యోతి, మహాలక్ష్మి నిమ్స్‌లో చికిత్స పొంది కోలుకొని డిశ్చార్జ్ అయ్యారని, కానీ శైలజ అడ్మిట్ అయినప్పటి నుంచి సీరియస్ కండిషన్‌లోనే ఉన్నట్టు పేర్కొన్నారు. కిడ్నీ సమస్యతో డయాలసిస్‌పై ఉన్నట్టు ఇప్పటికే పలుమార్లు మాజీ మంత్రి హరీశ్‌రావు వచ్చి డాక్టర్, అధికారులతో మాట్లాడి బాలికకు అన్నిరకాల చికిత్సలు అందించాలని కోరినట్టు గుర్తుచేశారు. శైలజ పరిస్థితి సీరియస్‌గా ఉన్నదని, కిడ్నీలు పూర్తిగా పనిచేయడం లేదని, ఐసీయూలో కృత్రిమశ్వాస అందిస్తున్నట్టు చెప్పారు. ఎస్సీ విద్యార్థిని శైలజ తన భవిష్యత్తు కలల కోసం పాఠశాలలో చేరగా, నాసిరక భోజనం వికటించి ఇలా కావడం ఆమె కుటుంబసభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పురుగుల అన్నం తినలేక విద్యార్థులు ఆకలితో అలమటించినా, ఫుడ్‌పాయిజన్‌తో చిన్నారులు దవాఖానల పాలైనా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. 11 నెలల కాంగ్రెస్ పాలనలో 42 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని మండిపడ్డారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్య పాలనకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేశారు.

శైలజను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొప్పుల, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి, రాజీవ్‌సాగర్

జ్యోతి ప్రజ్వలన చేసి ఆటో షోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు, ఖమ్మం మేయర్ నీరజ, మాజీ ఎమ్మెల్యే సండ్ర, కారును పరిశీలిస్తున్న నేతలు

ఖమ్మంలో ఆటో షో అదుర్స్

'నమస్తే తెలంగాణ' ఆధ్వర్యంలో నిర్వహణ • ప్రారంభించిన ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర

రఘునాథపాలెం, నవంబర్ 23: ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానం వేదికగా 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో శనివారం ఆటో షో ప్రారంభమైంది. సొంత కారు, బైక్ కలను సాకారం చేసుకునే వారి కోసం ఏర్పాటు చేసిన ఆటో సంస్థల ప్రదర్శన వాహన ప్రియులను విశేషంగా ఆకట్టుకున్నది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఖమ్మం మేయర్ పునకొల్లు నీరజ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సౌకర్యవంతమైన జీవనాన్ని ప్రతి కుటుంబం కోరుకుంటున్న తరుణంలో ఇటువంటి వేదికలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని 'నమస్తే తెలంగాణ' ఇటువంటి షోలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఖమ్మంతోపాటు హైదరాబాద్, వరంగల్ జిల్లాలకు చెందిన అన్నిరకాల కంపెనీలు ఒకచోట కలిసి ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. వినియోగదారుడి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ ఆటో షోను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖమ్మం నగరంతో పాటు జిల్లావ్యాప్తంగా వాహనప్రియులు ఆటో షోకు రావడంతో ప్రాంగణం కిటకిటలాడింది. ఈ ఆటో షో నేడు ముగియనున్నది.

కొలువుదీరిన వివిధ కంపెనీల కార్లు

ఈ ఆటో షోలో వివిధరకాల మోడళ్లకు చెందిన కార్లు, బైక్‌లు కొలువుదీరాయి. మహావీర్ స్కోడా, కియా, సిట్రోయిన్ ప్రైడ్ మోటార్స్, ప్రైడ్ జీప్, స్పార్క్ హీరో, టాటా మోటార్స్, కాకతీయ టయోటా, వెంకటరమణ బజాజ్, మహీంద్రా కటకం హోండా, గ్రీన్ హోండా షోరూంలు అన్ని అన్నిరకాల వాహనాలను అందుబాటులో ఉంచాయి. రుణ సదుపాయం కల్పించేందుకు ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్‌లు ఆటో షోలో పాల్గొన్నాయి. టీవీ పార్టనర్‌గా టీ న్యూస్, డిజిటల్ పార్టనర్‌గా ఎస్ టీవీ వ్యవహరించాయి. బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఆర్జేసీ, ఎస్‌బీఐటీ విద్యాసంస్థల అధినేత గుండాల కృష్ణ, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, ఖమ్మం నగర బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పీఏ చిరుమామిళ్ల రవికిరణ్, మాటేటి కిరణ్, నమస్తే తెలంగాణ ఖమ్మం బ్రాంచ్ మేనేజర్ రమేశ్, బ్యూరో ఇన్‌చార్జ్ మాటేటి వేణు, యాడ్స్ మేనేజర్ బోయిన శేఖర్‌బాబు, సర్క్యులేషన్ మేనేజర్ రాంబాబు, యాడ్ ఆఫీసర్లు నాగరాజు, సురేందర్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్, సురేశ్, కరుణాకర్, దశరథ్, రిపోర్టర్లు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ కమిటీలే' అంతిమం కాదు

- ఇండ్ల లబ్ధిదారుల ఎంపికపై హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల పథకానికి లబ్ధిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీల నిర్ణయమే అంతిమంకాదని హైకోర్టు తేల్చి చెప్పింది. అయితే, ఈ పథకం అమలులో భాగంగా లబ్ధిదారులను గుర్తించేందుకు ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం సరైనదేనని పేర్కొంది. పథకాల అమలు ప్రభుత్వ విచక్షణాధికారంపైనే ఆధారపడి ఉంటుందని స్పష్టం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా లబ్ధిదారుల ఎంపిక జరిగితే కోర్టును ఆశ్రయించవచ్చని స్పష్టం చేసింది. ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు కోసం కలెక్టర్లకు అధికారం కల్పిస్తూ గత నెల 11న జారీచేసిన జీవో 33పై బీజేపీ శాసనసభాపక్షంతోపాటు మరికొందరు పిటిషన్ వేయగా హైకోర్టు స్పందించింది.

తెలంగాణ, ఏపీ హైకోర్టుల ఉద్యోగుల పరస్పర సహకార సంఘం సర్వసభ్య సమావేశం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే సురేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు హరయ్య, ప్రధాన కార్యదర్శి హెచ్ ప్రద్యుమ్నకుమార్, అరుణ్‌కుమార్‌రెడ్డి, సయ్యద్ రియాజ్, రజని, సరోజినీ బాయి, బీ సుదర్శన్, కే వెంకటేశ్, మహమ్మద్ హమీద్, మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

న్యాయసేవల్లో పారదర్శకతకు ఎన్‌స్టెప్

- జస్టిస్ గవాయ్ చేతులమీదుగా పోర్టల్ ప్రారంభం

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): న్యాయసేవలు పారదర్శకంగా ఉండేందుకు నేషనల్ సర్వీసెస్ అండ్ ట్రాకింగ్ ఆఫ్ ఎలక్ట్రానిక్ ప్రాసెస్ (ఎన్‌స్టెప్) దోహదపడుతుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి, జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ బీఆర్ గవాయ్ తెలిపారు. క్రిమినల్ కేసుల్లో ఇకపై ఈ-సమన్లు జారీ చేసేందుకు ఏర్పాటు చేసిన ఎన్‌స్టెప్ పోర్టల్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. హైదరాబాద్ జ్యుడీషియల్ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధేతోపాటు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న 108 సిబ్బంది

- క్షతగాత్రుడి వద్దనున్న 3లక్షలు అప్పగింత

పెబ్బేరు, నవంబర్ 23 : ప్రమాదానికి గురైన వాహనంలోని క్షతగాత్రుడి వద్ద లభించిన రూ.3 లక్షల నగదును 108 అంబులెన్స్ సిబ్బంది తిరిగి అప్పగించిన ఘటన వనపర్తి జిల్లా పెబ్బేరులో శనివారం చోటుచేసుకున్నది. ఏపీలోని అనంతపురం జిల్లా మదనపల్లి నుంచి టమాటా లోడుతో హైదరాబాద్ వెళ్లిన డీసీఎం వాహనం తిరుగు ప్రయాణంలో పెబ్బేరుకు సమీపంలోకి రాగానే ప్రమాదానికి గురైంది. ముందు వెళ్తున్న టిప్పర్‌ను డీసీఎం వాహనం ఢీకొట్టడంతో డ్రైవర్ ఇంతియాజ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఎంతో కష్టపడి అతడిని బయటకు తీసి ప్రథమ చికిత్స చేసిన 108 సిబ్బంది, అతని వద్ద ఉన్న రూ.3 లక్షల నగదును భద్రంగా తీసిపెట్టి అతను సూచించిన నారాయణస్వామి అనే వ్యక్తికి అప్పగించారు. 108 సిబ్బంది ఖాజా, మహ్మద్‌ను పలువురు ప్రశంసించారు.

సర్వే పత్రాలు రోడ్డుపైనా..?

- అధికారుల తీరుపై బీసీ కమిషన్ ఆగ్రహం
- తార్నాక ఘటనపై నివేదిక ఇవ్వాలని ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): ఇంటింటి సర్వే పత్రాలు రోడ్డుపై కనిపించటం ఏంటని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఘటనకు సంబంధించిన సమగ్ర రిపోర్టును అందించాలని అధికారులను ఆదేశించారు. సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన పత్రాలు ఇటీవల తార్నాక రోడ్లపై ఎక్కడపడితే అక్కడ కనిపించాయి. అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లుకొడుతున్నాయి. ఈ విషయం బీసీ కమిషన్ దృష్టి వెళ్లడంతో చైర్మన్ నిరంజన్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఆ దరఖాస్తులు జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్, మేడ్చల్ మల్కాజ్‌గిరికి చెందినవిగా అధికారులు వెల్లడించారు. ఘటనపై సమగ్ర రిపోర్ట్ అందించాలని జవహర్‌నగర్ మున్సిపల్ కమిషనర్, మేడ్చల్ కలెక్టర్‌కు లేఖ రాశారు. ఈ విషయాన్ని డీజీపీ దృష్టికి సైతం తీసుకెళ్లారు.

90 శాతం సర్వే పూర్తి

- కంప్యూటరీకరణ ప్రారంభం

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ) : సామాజిక ఆర్థిక విద్యా ఉపాధి రాజకీయ కుల గణన సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) వివరాల కంప్యూటరీకరణ పలు జిల్లాల్లో ప్రారంభమైంది. ఇప్పటికే పలు జిల్లాల్లో సర్వే పూర్తి కాగానే, మరి కొన్ని జిల్లాల్లో 90 శాతానికి పైగా ఉంటుంది. ఇదే సమయంలో డాటా కంప్యూటరీకరణ ప్రక్రియను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు కలెక్టర్లు ప్రారంభించారు. డాటా ఎంట్రీ ఆపరేటర్, ఎన్యుమరేటర్ కలిసి సర్వే వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. సర్వే పత్రాల భద్రత విషయంలో తగు జాగ్రత్త తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ సమగ్ర ఇంటింటి సర్వే లో మొత్తం 1,16,93,698 నివాసాలు గుర్తించగా, నేటివరకు 1,05,03,257 నివాసాలలో (89.8 శాతం) సర్వే పూర్తి చేసింది. 2,61,384 నివాసాలకు సంబంధించిన సర్వే వివరాలు కంప్యూటరీకరణ చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 25,05,517 నివాసాలు సర్వే చేయాల్సి ఉండగా శనివారం వరకు 17,47,056 నివాసాలు సర్వే పూర్తిచేశారు.

స్థానిక ఎన్నికలు ఇప్పట్లో లేనట్టే!

- ఇంకా పూర్తికాని బీసీ కమిషన్ అభిప్రాయ సేకరణ
- కొనసాగుతున్న డెడికేటెడ్ కమిషన్ సమావేశాలు
- కులగణన సర్వేకు న్యాయపరమైన చిక్కులు
- మహారాష్ట్ర ఓటమి నేపథ్యంలో వెనకడుగు
- ప్రతికూల ఫలితాలు వస్తాయనే ఆందోళన

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): వచ్చే నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని సర్కారు ఘంటాపథంగా చెప్తున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా కనిపిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం వేసిన డెడికేటెడ్ కమిషన్ సమావేశాలు కొనసాగుతుండటం, కులగణన సర్వే ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం లేకపోవడం, బీసీ కమిషన్ అభిప్రాయ సేకరణ కూడా గడువులోగా పూర్తయ్యేలా కనిపించకపోవటంతో ఎన్నికల వాయిదా అనివార్యంగా కనిపిస్తున్నది. మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్‌కు జరిగిన ఘోర పరాభవ భయంతో ఇప్పట్లో స్థానిక ఎన్నికలకు వెళ్లకపోవడమే ఉత్తమమని కొందరు మంత్రులు, పార్టీ ముఖ్యులు వారిస్తున్నట్టు తెలిసింది.

తప్పని పరిస్థితుల్లో డెడికేటెడ్ కమిషన్

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్..ఈ దిశగా చర్యలు చేపట్టలేదు. ఓ దశలో రిజర్వేషన్లు ఇవ్వకుండానే పాత విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. బీసీ వర్గాల మంత్రులు, ఎమ్మెల్యేలు అభ్యంతరం చెప్పడంతోపాటు బీసీ సంఘాల నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది బలహీనవర్గాలను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైకోర్టులోనూ పిటిషన్లు వేశారు. కోర్టు కూడా రిజర్వేషన్ల అమలుపై ప్రభుత్వం చిత్తశుద్ధిని శంకించడంతో ఎన్నికల నిర్వహణకు వెనుకడుగు వేసింది. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్లు తేల్చిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పింది. బీసీ కమిషన్‌నే డెడికేటెడ్ కమిషన్‌గా గుర్తించాలని కోర్టు దృష్టికి తీసుకెళ్లగా అంగీకరించలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో నవంబర్ 4న డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటుచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం కమిషన్ జిల్లాల్లో పర్యటిస్తూ వివరాలు సేకరిస్తున్నది. పూర్తిచేసి సర్కారుకు నివేదిక అందించాలంటే మరో నెల రోజులు పట్టవచ్చని అధికారులు చెప్తున్నారు.

కోర్టులో కులగణన సర్వే చెల్లుబాటు డౌటే!

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్ల అమలుతోపాటు సామాజిక వర్గాల లెక్క తేల్చాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఇందులో భాగంగా నవంబర్ 6 నుంచి కులగణనను ప్రారంభించింది. ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని అధికారులకు నిర్దేశించింది. సర్వే ఆశించిన మేర ముందుకుసాగడం లేదు. ఇంటింటికి వెళ్లి వివరాల సేకరణ పూర్తి చేయాలంటే మరో 10 రోజులకుపైగా పట్టే అవకాశమున్నది. సేకరణ పూర్తయినా ఆన్‌లైన్ చేసేందుకు మరో 20 రోజులు గడువు అవసరమని అధికారులు చెప్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయినా కోర్టులో నిలిచే అవకాశం లేదని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. కులగణనచేసే అధికారం రాష్ట్రాలకు లేదని పేర్కొంటున్నారు. సుప్రీం కోర్టు నిర్దేశించిన మేరకు ట్రిపుల్ టెస్ట్ పాస్‌కావాల్సి ఉంటుందని చెప్తున్నారు. గతంలో మహారాష్ట్ర, కర్ణాటక, బీహార్‌లోనూ కులగణన చేపట్టినా కేంద్రం ఒప్పుకోలేదని ఉదహరిస్తున్నారు. రాష్ట్రంలోనూ కులగణన సర్వే కోర్టులో చెల్లుబాటయ్యే పరిస్థితి ఉండదని విస్పష్టంగా చెప్తున్నారు.

మహారాష్ట్రలో పరాభవంతో వెనుకడుగు..

మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాభవంతో తెలంగాణలో స్థానిక ఎన్నికలపైనా ఆ ప్రభావం పడుతుందని భావించిన పలువురు మంత్రులు, పార్టీ ముఖ్యులు ఇప్పట్లో ఎన్నికలు వద్దని వారిస్తున్నట్టు తెలిసింది. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పెద్దలతోపాటు సీఎం రేవంత్, పలువురు మంత్రులు తెలంగాణలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని ఊదరగొట్టినా అక్కడి జనం నమ్మలేదు. ఇక్కడా రేవంత్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైంది. నిధుల కొరతను సాకుగా చూపుతూ పథకాలన్నీ పక్కనబెడుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికలకు వెళ్లడం అంతమంచిది కాదని పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. స్థానిక ఎన్నికలు నిర్వహించి లేనితలనొప్పిని తెచ్చుకోవడం ఎందుకని యోచిస్తున్నట్టు తెలిసింది.

ములుగు జిల్లా వాజేడు మండల ఎంపీడీవో కార్యాలయంలో సర్వే వివరాలు కంప్యూటర్లలో నమోదు చేస్తున్న ఆపరేటర్లు

గుట్టలు దిగి వస్తేనే సర్వే

- పెనుగోలు గ్రామానికి వెళ్లని ఎన్యూమరేటర్లు
- కిందకు వస్తేనే వివరాలు నమోదు చేస్తామని కబురు
- సందిగ్ధంలో 15 గిరిజన కుటుంబాల సర్వే

వాజేడు, నవంబర్ 23 : ములుగు జిల్లా వాజేడు మండలం కొంగాల గ్రామ పంచాయతీ పరిధిలోని గుట్టలపై నివసిస్తున్న పెనుగోలు గ్రామస్థులు కిందికి వస్తేనే సమగ్ర కుటుంబ సర్వే వివరాలు నమోదు చేస్తామని అధికారులు వెల్లడించారు. మండల కేంద్రానికి దూరంగా గుట్టలపై 15 గిరిజన కుటుంబాలు ఉంటున్నాయి. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ, రాజకీయ, కుల సర్వేలో వీరి వివరాలు ఇప్పటివరకు నమోదు చేయలేదు. ఇప్పటికే మండలంలో సేకరించిన వివరాలను ఎంపీడీవో ఆఫీస్‌లో ఆన్‌లైన్ చేస్తున్నారు. అయితే ఎన్యూమరేటర్లు గుట్టపై ఉన్న గిరిజనుల వివరాల సేకరణపై సందిగ్ధత నెలకొన్నది. ఈ విషయమై 'నమస్తే తెలంగాణ' ఎంపీవో శ్రీకాంత్‌నాయుడు, కొంగాల పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి ప్రభాకర్‌ను వివరణ కోరగా.. భద్రతా కారణాల వల్ల గుట్టపైకి వెళ్లలేదని, అక్కడున్న వారిని కిందకు రావాలని కబురు పంపామని, వారు వస్తే వివరాలు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

మియాపూర్, నవంబర్ 23: అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి చెందిన ఘటన మియాపూర్ ఠాణా పరిధిలోని ఓ కార్పొరేట్ జూనియర్ కళాశాలలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు.. షాద్‌నగర్‌కు చెందిన గౌరిశెట్టి శ్రీనివాస్, మాధవి దంపతుల కొడుకు గౌరిశెట్టి కౌశిక్ రాఘవ(16).. మియాపూర్‌లోని కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి 11గంటల వరకు రాఘవ తోటి విద్యార్థులతో గడిపాడు. అనంతరం తన గదికి వచ్చి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. శనివారం ఉదయం 5గంటలకు హాస్టల్ వార్డెన్ వచ్చి చూసేసరికి మెడకు తాడుతో కిందపడి ఉన్నాడు. రాఘవను హైదర్‌నగర్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కళాశాల ఒత్తిడితోనే తమ కొడుకు బలవన్మరణానికి పాల్పడ్డాడని తల్లిదండ్రులు ఆరోపించారు.

మధ్యాహ్న భోజనానికి చికిత్స అవసరం

- మార్పులు కోరుతున్న ప్రజాసంఘాలు
- కలుషితాహారంపై నిపుణుల ఆగ్రహం
- ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో భోజనం కలుషితం కావడంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. నెలలో ఎక్కడో ఓ చోట ఇలాంటి ఘటన చోటు చేసుకుంటున్నది. నారాయణపేట జిల్లా మాగనూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించడం సంచలనంగా మారింది. ఇది మరువక ముందే కరీంనగర్ జిల్లా బూరుగుపల్లి పాఠశాలలో ఆహారం కలుషితమైన ఘటన వెలుగుచూసింది. పర్యవేక్షణను గాలికొదిలేసిన ప్రభుత్వ పెద్దలు, నిర్లక్ష్యం వీడని అధికారులు పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజన పథకం ప్రక్షాళన అవసరం అని ఉపాధ్యాయ నేతలు, నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధ్యాయ నేతలు, నిపుణుల సూచనలు

- మండల కేంద్రాలు, అర్బన్ ప్రాంతాల్లో సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటు
- తక్కువమంది విద్యార్థులు గల పాఠశాలలకు సెంట్రలైజ్డ్ కిచెన్ల నుంచి భోజనం సరఫరా
- పాతబడిన వంట పాత్రల స్థానంలో కొత్తవి కొనుగోలు
- మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు సకాలంలో బిల్లులు, సిబ్బందికి కనీస వేతనం రూ.9,048 చెల్లింపు
- కిచెన్ షెడ్ల నిర్మాణం, మరమ్మతులకు నిధుల మంజూరు
- ఏజెన్సీలు సమ్మె చేసినప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే అధికారం కలెక్టర్లకు అప్పగింత
- ప్రత్యేక కమిటీ ద్వారా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ టెండర్ల ద్వారా సరకుల కొనుగోలు
- ప్రభుత్వమే బియ్యం, కూరగాయలు, పప్పులు, పెరుగు, కోడిగుడ్లు, వంటసరకులు పంపిణీ
- కేజీబీవీ, రెసిడెన్షియల్, ప్రభుత్వ, లోకల్ బాడీ పాఠశాలల్లో కామన్ మెనూ అమలు

అందరికీ కామన్ మెనూ అమలు చేయాలి

మధ్యాహ్న భోజన పథకాన్ని మెరుగుపర్చాలి. అన్ని విద్యాసంస్థలకు కామన్ మెనూను అమలు చేయాలి. గురుకుల విద్యార్థులకు భోజనంతో పాటు ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్, టీ ఇస్తున్నారు. వీటిని ఇతర స్కూళ్లలోనూ అందించాలి. టీచర్లను బోధనేతర విధులను వినియోగించకూడదని విద్యాహక్కు చట్టం స్పష్టంచేసింది. ఫుడ్ పాయిజన్ ఘటనలకు టీచర్లు, హెచ్‌ఎంలను బాధ్యతలను చేయడం భావ్యం కాదు.

- రాజభాను చంద్రప్రకాశ్, రాష్ట్ర హెచ్‌ఎం అసోసియేషన్ అధ్యక్షుడు

శిక్షల రేటు 100% పెరగాలి: డీజీపీ

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): ఎన్డీపీఎస్ కేసుల్లో శిక్షల రేటు పెరిగిందని డీజీపీ జితేందర్ వెల్లడించారు. ఈ ఏడాది 17% నమోదైందని, దీనిని నూటికి నూరు% పెంచేందుకు విచారణాధికారులు కృషి చేయాలని ఆయన సూచించారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో డీజీపీ కార్యాలయంలో విచారణాధికారులకు, కోర్టు డ్యూటీ అధికారులకు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడారు. తెలంగాణను డ్రగ్స్ రహితంగా మార్చేందుకు రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో కృత నిశ్చయంతో ఉన్నదని తెలిపారు. ఈ ఏడాది 226 కేసుల్లో తీర్పులు వెలువడ్డాయని, వీటిల్లో 17 శాతం అంటే 39 కేసుల్లో 6 నెలల నుంచి 20 ఏండ్ల వరకు శిక్షలు పడ్డాయని చెప్పారు.

వీణవంక మండలంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంచుతుండగా బయట పహారా కాస్తున్న పోలీసులు

చెక్కుల పంపిణీకి వంద మంది పోలీసుల పహారా

- 25 వాహనాలతో కాన్వాయ్
- దళితబంధు ఎఫెక్ట్‌తో కాంగ్రెస్ నాయకులకు రక్షణ

వీణవంక, నవంబర్ 23: 'ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 25 వాహనాల కాన్వాయ్.. రక్షణగా వంద మంది పోలీసులు.. ఇదంతా ఓ ముఖ్యమంత్రికో.. ఓ మంత్రికో.. లేక ఎమ్మెల్యేకో కాదు.. కేవలం అధికార పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాల్గొన్న కార్యక్రమం కోసం మాత్రమే. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గం వీణవంక మండలంలోని 13 గ్రామాల్లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు శనివారం 26 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేయగా, దళితబంధు బాధితులు అడ్డుకుంటారేమోనన్న సమాచారంతో 80 మంది స్పెషల్ పోలీస్ ఫోర్స్‌తోపాటు 20 మంది స్థానిక పోలీసులు రంగంలోకి దిగారు. ప్రణవ్ వాహనానికి ముందు, వెనుక పోలీస్ వాహనాలతోపాటు సుమారు 25 వాహనాలు కాన్వాయ్‌గా వచ్చాయి. 26 మంది ఇండ్లకు వెళ్లి చెక్కులు అందిస్తుండగా బయట పోలీసులు పహారా కాశారు. పోలీసులు భారీగా మోహరించడంతో ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురయ్యారు.